క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నంద్యాల(వ్యవసాయం): ఆల్ మేవా నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ పీఎంజేవీకే స్కీమ్‌లో నిర్వహించిన భవన సముదాయాలు మిగతా వాటిని కూడా త్వరితగతిన నిర్మాంచాలని వినతి పత్రాలు అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ త్వరలో అధికారులతో మాట్లాడి భవన నిర్మాణాన్ని చేపడుతామన్నారు. జిల్లా అధ్యక్షుడు అబులైజ్, ఇమ్రాన్‌పాషా, రషీద్, సైపుల్లా, అమీరుద్దీన్, మహమ్మద్‌గౌస్ పాల్గొన్నారు.

యాదవాడ యువకుడికి డాక్టరేట్



ఓబులేసు

ఆళ్లగడ్డ: రూరల్ మండలం యాదవాడ గ్రామానికి చెందిన ఓబులేసు జేఎన్‌టీయూ యూనివర్సిటీలో మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో డాక్టరేట్ పొందారు. ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్‌కుమార్ పర్యవేక్షణలో స్టేట్ బ్యాంక్ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉద్యోగ సంతృప్తి, మూల్యాంకనం అనే శీర్షికన పరిశోధన చేసి పత్రాలను సమర్పించారు. దీంతో యూనివర్సిటీ డాక్టరేను అందజేసింది. కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు ఓబులేసును అభినందించారు.

వేగంగా సీసీ రోడ్ల నిర్మాణం



సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

రుద్రవరం: నర్సాపురంలో దాదాపు రూ.12లక్షలతో సీసీ రోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లినప్పుడు ప్రజలు సీసీ రోడ్లు వేయించాలని కోరారు. దీంతో ఆయన ప్రభుత్వం నుంచి మంజూరైన నిధుల్లో నుంచి రూ.12లక్షలు కే టాయించారు. కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు.నర్సాపురం మెట్ట పక్కనే ఉన్న రెండు కాలనీల్లో పనులు వేగంగా చేయిస్తున్నాడు. ఆయా కాలనీ వాసులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా స్వాతి వేడుకలు



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ఆవరణలో శనివారం స్వామి వారి జన్మనక్షత్రం పురస్కరించుకొని స్వాతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజన కార్యక్రమం నిర్వహించి పట్టువస్త్రాలచే అలంకరించారు. అలాగే శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణం కోసం సుదర్శన హోమం జరిపించారు.

భక్తిశ్రద్ధలతో ఊంజల సేవ



సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ధనుర్మాసాన్ని పురస్కరించుకొని సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఊంజల సేవా కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

పింఛన్ పెంచి.. ఆనందం పంచి

- పింఛన్ పెంపుతో లబ్ధిదారుల్లో సంతోషం
- రూ.3వేలకు పెంచిన ప్రభుత్వం
- నేడు ఉయ్యాలవాడలో పింఛన్ల పంపిణీ

ఉయ్యాలవాడ : నూతన సంవత్సరం కానుకగా రాష్ట్ర ప్రభుత్వం అవ్వా, తాతలకు పింఛన్ మొత్తాన్ని రూ. 3 వేలకు పెంచింది. మండలంలో 3,981 మంది లబ్ధిదారులకు రూ. 1,17,63,000 విడుదలైంది. తాము అధికారంలోకి వస్తే పింఛన్ మొత్తాన్ని దశల వారీగా పెంచుతామని ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటను నిలుపుకున్నారు. దీంతో లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

వితంతు పింఛన్ మంజూరైంది



మాది పేద కుటుంబం నా భర్త మధు 8 నెలల క్రితం మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా చింతకొమ్మ దిన్నె వద్ద బస్సు ప్రమాదంలో మృతి చెందాడు. నేను కూలీ పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నా. కొత్త ఏడాది వితంతు ఫించన్ మంజూరు కావడం ఆనందంగా ఉంది. – గంగమ్మ, సర్వాయిపల్లె

సంతోషంగా ఉంది



గతంలో మనవరాళ్లు అడిగితే ఇవ్వడానికి నయా పైసా కూడా ఉండేది కాదు. గత ప్రభుత్వంలో పింఛన్ కోసం నానా కష్టాలు పడ్డాను. మా గ్రామ వలంటీర్ వెంకటశివుడు దరఖాస్తు చేసి పింఛన్ వచ్చేలా చేశాడు. కొత్తగా ఇప్పుడు రూ. 3 వేలు అందుతుండడంతో చాలా సంతోషంగా వుంది. జగన్ సాయంతో నా కష్టాలు తీరుతున్నాయి. – లక్ష్మమ్మ, ఆర్.జంబులదిన్నె

ఊహించలేదు



నా భర్త గురప్ప పక్షవాత వ్యాధితో ఆరు నెలల క్రితం మృతి చెందాడు. గ్రామ వలంటీర్ వీరలక్ష్మి ఇంటికి వచ్చి పింఛన్‌కు దరఖాస్తు చేయించింది. పింఛన్ ఇంత త్వరగా వస్తుందని ఊహించలేదు. – దూదేకుల హుసేనమ్మ, కొండుపల్లె

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తుంది. మండలంలోని 11 గ్రామ సచివాలయాలకు కొత్తగా 67 ఫించన్లు మంజూరయ్యాయి. ఆదివారం ఉయ్యాలవాడ గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి నూతన పింఛన్లు అందజేస్తారు. – ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ

సీఎంకు రుణపడి ఉంటా



కొత్త ఏడాదిలో వృద్ధాప్య పింఛన్ మంజూరు కావడం ఆనందంగా ఉంది. ఇప్పటికే రైతు భరోసా, విద్యాదీవెన అందుతుంది. నా కుమారుడు నంద్యాల పట్టణంలో డిగ్రీ చదువుతున్నాడు. పథకాలు అందజేసి మా కుటుంబాన్ని ఆదుకుంటున్న సీఎంకు రుణపడి ఉంటాం. – నాగరాజు యాదవ్, ఆర్.పాంపల్లె

ముగిసిన గ్రామస్థాయి పోటీలు

గోస్పాడు: మండలంలో ఆడుదాం ఆంధ్ర గ్రామ స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయని ఎంపీడీఓ అనసూయ తెలిపారు. దీబగుంట్ల హైస్కూల్‌లో శనివారం కబడ్డీ, మహిళలకు ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈనెల 10వ తేదీ నుంచి మండల స్థాయి పోటీలు ప్రారంభిస్తామని చెప్పారు.

పశువులకు టీకాలు వేయించండి

రుద్రవరం: గాలి కుంటు వ్యాధి సోకకుండా ఉండేందుకు పశువులకు టీకాలు వేయించాలని పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ రైతులకు సూచించారు. మండలంలోని ఎర్రగుడిదిన్నె పంచాయతీ మజరా మాచినేనిపల్లె గ్రామంలో శనివారం పశువులకు టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ముగిసినప్పటికీ అప్పటి బురద ఇంకా ఉంటుందని అందులో తిరగడం వలన పశువులకు గాలి కుంటు వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు టీకాలు వేస్తామని వివరించారు.

నాడు-నేడుతో రాష్ట్రాలకు ఏపీ ఆదర్శం



భనేశ్వర్ సింగ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): ఏపీలో జరుగుతున్న నాడు-నేడును ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవాలని, రాష్ట్రంలో ఉర్దూను రెండవ అధికార భాషగా అమలు చేయడం హర్షనీయమని, ప్రథమ ప్రాజెక్టు కేంద్ర కమిటీ సభ్యులు భనేశ్వర్ సింగ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మొదటి విడత కింద ఉర్దూ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రం ముందజలో ఉందని అభినందించారు. అనంతరం నంద్యాల మండలంలోని అయ్యలూరు ఉర్దూ పాఠశాలను సందర్శించారు. రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎండీ ఇమ్రాన్, కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ తన్వీర్, హెచ్ఎం అజీత్ పాల్గొన్నారు. అలాగే పాఠశాలలో మొక్క నాటారు. చివరగా ఉపాధ్యాయులు భవనేశ్వర్ సింగ్‌ను సన్మానించారు. ఉపాధ్యాయులు నజీర్, కలీముల్లా, షబానా పర్వీన్, అఖిలభాను పాల్గొన్నారు.

సహకార సంఘాలకు పెద్దపీట



సహకార సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతోనే సహకార సంఘాల అభివృద్ధికి పెద్దపీట వేశారని ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రంలో రూ.28.62 లక్షలతో సహకారం సంఘం, రూ.40లక్షలతో నిర్మించిన నూతన గోదాంను చైర్మన్ భూమా చెంచిరెడ్డి అధ్యక్షతన కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఎస్వీ విజయమనోహరి మాట్లాడుతూ దొర్నిపాడు సహకార సంఘానికి పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఎంపీపీలు అమర్‌నాథ్ రెడ్డి, వీరభద్రుడు, జెడ్పీటీసీ శకుంతల, యాదవకార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మోహన్‌నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, మనోహర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శివరామిరెడ్డి, కేడీసీసీ బాంక్ జనరల్ మేనేజర్ శివలీల, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్ర హర్షవర్ధన్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శివారెడ్డి, కోవెలకుంట్ల కేడీసీసీ బ్యాంక్ అమర్‌నాథ్‌రెడ్డి, సీఈఓ సొసైటీ ప్రసాద్, కేడీసీ బ్యాంక్ డైరెక్టర్లు గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, నాసారి వెంకటేశ్వర్లు, ఎస్‌బీఎల్‌సీఓ లక్ష్మీనారాయణ, పీఎంసీ చైర్మన్ నర్సిరెడ్డి, నంద్యాల డివిజన్ సొసైటీ సీఓలు, చైర్మన్‌లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల వైస్‌ప్రెసిడెంట్



కొత్త పింఛన్ అందజేస్తున్న జగదీశ్వరరెడ్డి



దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న కౌన్సిలర్

దొర్నిపాడు: మండలంలో నూతన పంఛన్ల పంపిణీ కొనసాగుతుంది. రూ.2,750 నుంచి రూ.3,000కు పెంచడంతో లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. శనివారం వైఎస్సార్‌సీపీ మండల వైస్ ప్రెసిడెంట్ లక్కు చంద్రశేఖర్‌రెడ్డి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు.

నంద్యాల(అర్బన్): టీడీపీ పాలనలో పింఛన్ అంటే లబ్ధిదారుల్లో ఆందోళన మొదలయ్యేదని, గ్రామ కార్యాలయాల వద్ద నిరీక్షించాల్సి వచ్చేదని, అలాంటి చర్యలుకు జగనన్న చెక్ పెట్టారని, వలంటీర్లు, గ్రామ సచివాలయాల ద్వారా ఇంటికే వచ్చి అందజేసేలా చర్యలు చేపట్టారని వైఎస్సార్‌సీపీ నంద్యాల మండల సీనియర్ నాయకులు జగదీశ్వరరెడ్డి తెలిపారు. మేజర్ పంచాయతీ కానాల గ్రామంలో శనివారం కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పీఎస్ నరేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా పింఛన్‌దారులకు పడిగాపులు, ఎదురు చూపుల బాధ పోయిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన రూ.3వేల హామీని నెరవేర్చి లబ్ధిదారుల్లో ఆనందం నింపారన్నారు. సర్పంచ్ బావమ్మ, ఎంపీటీసీ రంగారావు పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని 7వ వార్డులో మూగ దివ్యాంగుడికి ప్రభుత్వం పెంచిన రూ.3వేలు పింఛన్‌ను శనివారం కౌన్సిలర్ షేక్ అబ్దుల్‌కలాం, వలంటీర్ విశాలేశ్వరరావు అందజేశారు.

చంద్రబాబు అణగదొక్కాలని చూశాడు

దొర్నిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయాల్లో తమకు అండగా నిలిస్తే.. చంద్రబాబు మాత్రం తమ కుటుంబాన్ని అణగదొక్కాలని చూశాడని కేడీసీసీబ్యాంక్ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించి సొసైటీ భవనాన్ని ప్రారంభించేందుకు హాజరై మాట్లాడారు. ప్రజల గుండెల్లో జగనన్న ఉన్నారని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి పార్టీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

ఆర్టీసీ గిఫ్ట్ స్కీం విజేతల ఎంపిక

నంద్యాల టౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నంద్యాల -రుద్రవరం మార్గంలో తిరుగుతున్న 6 బస్సుల్లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీం విజేతలను లక్కీడిప్ ద్వారా నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ ఎంపిక చేశారు. రుద్రవరం గ్రామానికి చెందిన రామయ్యకు మొదటి బహుమతి, పార్లపల్లెకు చెందిన కే.నాగరాజుకు రెండో బహుమతి, శిరివెళ్లకు చెందిన సుభాన్‌కు మూడో బహుమతి దక్కింది. గెలుపొందిన వారు అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్)ను సంప్రదించాలని చెప్పారు.

ఆర్‌బీకేల ద్వారా జొన్న కొనుగోళ్లు

నంద్యాల(అర్బన్)/గోస్పాడు: 2023-24 రబీ సీజన్‌లో నంద్యాల మండల రైతులు సాగు చేసిన జొన్న పంట దిగుబడులను ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయనున్నట్లు నంద్యాల మండల, గోస్పాడు ఏఓలు ప్రసాదరావు, స్వప్నికారెడ్డి వేర్వేరుగా తెలిపారు. క్వింటా రూ.3180తో కొనుగోలు చేయనుందని చెప్పారు. అయ్యలూరు, గోస్పాడు ఆర్‌బీకేలో శనివారం జొన్నపంట దిగుబడుల కొనుగోళ్లపై రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సంచులు, హమాలీ, రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని, ఎఫ్ఏ క్యూ నాణ్యతకు లోబడి కొనుగోళ్లు ఉంటాయన్నారు.

క్రీడల్లో రాణించాలి

ఉయ్యాలవాడ : గ్రామీణ స్థాయి నుంచి పోటీతత్వంతో క్రీడల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక గ్రామ సచివాలయంలో ఈ నెల 10వ తేదీన మండల స్థాయి క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు టీ షర్ట్, టోపీలు అందజేసి మాట్లాడారు. ఎంపీడీఓ ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ మండల స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు 1,254 టీషర్ట్‌లు, టోపీలు ప్రభుత్వం మంజూరు చేయడంతో అందజేశామన్నారు. సర్పంచ్ మేకల ఓబులేసు, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి పాల్గొన్నారు.

చెంచులకు సుస్థిరమైన జీవనోపాధి



చెంచులతో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నాసారి ప్రసాద్, అధికారులు

ఆళ్లగడ్డ: చెంచులకు సుస్థిరమైన జీవనోపాధి కల్పించేందుకు పీఎం జన్‌మన్ యోజన పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మండల ఉపాధ్యక్షుడు నాసారి ప్రసాద్ అన్నారు. రూరల్ మండలం అహోబిలం చెంచు కాలనీల్లో శనివారం ఎంపీడీఓ మహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో చెంచులకు అవగాహన కార్యక్రమాల్లో చెంచుల సుస్థిరమైన జీవనోపాధికి 11 అంశాలపై సమీక్షించి చర్చించారు. వారు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని పథకం ప్రవేశ పెట్టిందన్నారు. కార్యక్ర మంలో మండలస్థాయి అధికారులు, చెంచులు పాల్గొన్నారు.

నేడు హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గుడ్‌షెప్పర్డ్ పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం నంద్యాల జిల్లా జూనియర్ హ్యాండ్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు మహబూబ్‌బాషా, రామేశ్వరరెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. ఉదయం 9గంటలకు జరిగే ఎంపిక పోటీలకు 19ఏళ్లలోపు బాలబాలికలు పాల్గొనాలన్నారు. ఎంపికైన బాలికల జట్టును 45వ రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈనెల 12, 13 తేదీల్లో రాజంపేటలో జరిగే బాలికల పోటీల్లో ఎంపికైన జిల్లా జట్టు పాల్గొంటుందన్నారు. వయస్సు ధ్రువీకరణ పత్రంతో రావాలని సూచించారు.

స్థలదాత కుటుంబానికి సన్మానం



స్థలదాత కుటుంబాన్ని సన్మానిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: స్థానిక సహకార సంఘం నిర్మాణానికి స్థల దానం చేసిన పోలు క్రిష్ణన్న, వెంకటరాముడు కుటుంబీకులు అయిన పోలు కొండయ్య, శ్రీరాములు, రమణయ్యను కేడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ శివలీల, ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, చైర్మన్ భూమా చెంచిరెడ్డి, కోవెలకుంట్ల కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. సహకార సంఘం అభివృద్ధిలో భాగమైన వారిని సన్మానించడం అభినందనీయమన్నారు.